నిబంధనలు అనుసరించి రుణాలు ఇవ్వండి: జేసీ

కలెక్టరేట్, జనవరి 24: వ్యవసాయానికి అనుబంధంగా ఉండే మత్స్య, పశు, ఉద్యాన రంగాల్లో ఉన్న రైతులకు రుణాలు ఇచ్చేటప్పుడు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారమే మంజూరు చేయాలని బ్యాంకర్లకు జేసీ మయూర్‌అశోక్ సూచించారు. తొలుత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో చర్చించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించారు. పాడి, మత్స్య యూనిట్లే కాకుండా ఇంకా ఏరకమైన రుణాలు ఇస్తున్నారో? వాటికి ఏ మేరకు రుణం అవసరం అవుతుందో అధికారులు ప్రతిపాదనలను డీసీసీబీకి అందజేయాలని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో జనార్ధాన్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న ఇంటి స్థలం రూ.60 వేలు





- కాలనీల్లో చేతులు మారుతున్న పట్టాలు
- ప్రభుత్వ సాయమూ స్థలం కొన్న వారికే!
- కంచరాం లేఔట్‌లో 100 దాకా విక్రయం!
- భవన నిర్మాణంలో కానరాని నిబంధనలు
- అధికారులు కనీసం పట్టించుకోని వైనం

● రాజాం మండలం కంచరాం సమీపంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో నిర్మించిన ఇల్లు ఇది. నిబంధనలకు విరుద్ధంగా రెండంతస్తుల భవనాన్ని నిర్మించారు. పైగా ఇది అసలు లబ్ధిదారుడు కట్టినది కాదు. లబ్ధిదారుని పేరిట ప్రభుత్వం అందించే రూ.1.8 లక్షలను సైతం తీసుకొని వేరొకరు ఇలా నిర్మించేశారు.

● కంచరాం జగనన్న కాలనీలోనే వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. అవి కూడా చేతులు మారిన ఇళ్ల స్థలాలే. వాస్తవానికి ఇక్కడ సెంటు స్థలంలో ఇల్లు మాత్రమే కట్టాలి. నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిలో వాణిజ్య అవసరాలకు తగ్గట్టు నిర్మిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు.

రాజాం మునిసిపాల్టీకి చెందిన జగనన్న కాలనీలో అనేక చిత్ర.. విచిత్రాలు చోటుచేసుకున్నాయి. దాదాపు 70 నుంచి వంద వరకూ ఇళ్లపట్టాలు చేతులు మారిపోయాయి. అసలు లబ్ధిదారు పేరుతో ప్రభుత్వం అందించే గృహనిర్మాణ సాయాన్ని కొంతమంది బినామీలు దక్కించుకున్నారు. కాలనీ లేఅవుట్‌లో చివరన ఉండే స్థలాల్లో షాపులను ఏర్పాటు చేస్తున్నారు. గృహనిర్మాణం ముసుగులో షాపింగ్ కాంప్లెక్సులను సైతం నిర్మిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి అధికారులతో చేతులు కలిపి ఈ దందా సాగిస్తున్నారు. నేతల అండదండలు ఉండడంతో నచ్చినట్టు చేస్తున్నారు.
- రాజాం

రాజాం మునిసిపాల్టీ పరిధిలోని నిరుపేదల కోసం కంచరాం సమీపంలో జగనన్న కాలనీ లేఅవుట్ ఏర్పాటుచేశారు. దాదాపు 1400 మందికి పట్టాలు ఇచ్చారు. అయితే తక్కువ స్థలం కేటయించడంతో చాలామంది ఇళ్ల కట్టేందుకు మొగ్గుచూపలేదు. పరిస్థితిని అనుకూలంగా మలుచుకునేందుకు కొందరు వ్యక్తులు రంగంలోకి దిగారు. నేతల సహకారం తీసుకుని లబ్ధిదారులకు రకరకాల ప్రలోభాలు పెట్టి పట్టాలను తీసుకున్నారు. సెంటు స్థలాన్ని రూ.60వేలకు కొనుగోలు చేసుకున్నారు. ఆ స్థలంలో అదే లబ్ధిదారుడి పేరిట వేరొక వ్యక్తులు ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు పొంది ఇళ్లు కట్టుకుంటున్నారు. లేఅవుట్‌లో 70 నుంచి 100 వరకూ ఇదే మాదిరిగా చేతులు మారినట్టు తెలుస్తోంది. రాజాం చుట్టుపక్కల ప్రాంతాల్లో సెంటు ధర లక్షల్లో పలుకుతుండగా.. ఇక్కడ మాత్రం పేద ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రూ.60 వేలు ముట్టజెప్పి ఇంటి స్థలాన్ని కైవసం చేసుకుంటున్నారు. చివరకు వారి పేరిట గృహనిర్మాణ సాయాన్ని పొంది ఎంచక్కా ఇళ్లు కట్టుకొంటున్నారు. దీంతో లబ్ధిదారులు నిలువునా మోసపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారులతో పాటు అధికార పార్టీ నేతలకు ముడుపులు అందుతున్నట్టు విమర్శలు విన్పిస్తున్నాయి.

వసతులూ అంతంతమాత్రం..

కంచరాం జగనన్న కాలనీ లేఅవుట్‌లో మౌలిక వసతులు కూడా మెరుగుపడలేదు. కనీసం మెటీరియల్ తరలించేందుకు సరైన రహదారి లేదు. ఈ కారణాలతోనే ఎక్కువ మంది ఇళ్ల నిర్మించేందుకు ఆసక్తిచూపడం లేదు. వాడుక నీరు వెళ్లే మార్గం కూడా లేక లేఅవుట్‌లో ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వీటిని సాకుగా చూపుతూ అక్రమార్కులు లబ్ధిదారులను భ్రమల్లో ముంచి వారి వద్ద నుంచి ఇళ్లపట్టాలు పొందుతున్నారు.

మోటార్లు చోరీ..

గృహాల నిర్మాణానికి నీటి సౌకర్యం కోసం 11 బోర్లను తీసి మోటార్లను ఏర్పాటు చేశారు. ఇందులో 8 మోటార్లు, విద్యుత్ మీటర్లు దొంగల పాలయ్యాయి. దీనిపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు కూడా చేశారు.

క్రయ విక్రయాలు నేరం..

జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాల క్రయ విక్రయాలు నేరం. ఎట్టి పరిస్థితుల్లో వాటిని విక్రయించేందుకు లబ్ధిదారులకు హక్కులేదు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. కంచరాం లేఅవుట్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-ఎస్.కృష్ణంరాజు, తహసీల్దారు, రాజాం



వాడుక నీరు బయటకు వెళ్లే మార్గం లేక లేఅవుట్‌లోనే నిలిచిపోయిన దృశ్యం

వైసీపీలో కలవరం



- షర్మిల పర్యటన తరువాత అసమ్మతి నాయకుల్లో కదలిక
- ఎస్.కోటలో తారస్థాయికి వివాదం
- మరోవైపు టీడీపీలో భారీగా చేరికలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటన తరువాత అధికార వైసీపీ నాయకుల్లో కలవరం మొదలైంది. కేడర్‌ను ఎలా కాపాడుకోవాలోనని మథనపడుతున్నారు. చేజారిపోకుండా కింది స్థాయి నాయకులకు ఫోన్‌లు చేసి ఆరా తీస్తున్నారు. మరోవైపు అసమ్మతి నాయకులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. కాంగ్రెస్ నాయకులకు కొందరు టచ్ ఉన్నారని సమాచారం. ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వంపై విరక్తి చెందిన నాయకులు, కార్యకర్తలు చాలా మంది అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీలోకి వస్తున్నారు. ఈ ఐదేళ్లలో తీవ్ర నష్టానికి గురైన నాయకులు తమ అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. రాజాం నియోజకవర్గంలో వందలాది కుటుంబాలు ఇప్పటికే పార్టీ మారాయి. విజయనగరం కార్పొరేషన్‌లోని కొన్ని డివిజన్లు, బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లోనూ వైసీపీకి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, అనుచర కుటుంబాలు టీడీపీలో చేరిన సంగతి చూస్తూనే ఉన్నాం. షర్మిల పర్యటనతో వైసీపీ నాయకుల్లో మరింత ఆందోళన నెలకొంది. వైసీపీ నాయకత్వంలో ఉన్న వారంతా ఇంచుమించు గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన వారే కావటం గమనార్హం. ఇపుడు పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల రావడంతో అప్పటి కాంగ్రెస్ నాయకులు మళ్లీ మాతృపార్టీవైపు దృష్టి సారిస్తున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. అసమ్మతి సెగలు రేగుతున్న చోట్ల నియోజకవర్గ స్థాయి నాయకులు కూడా కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది.

సూటిగా విమర్శలు

జిల్లాలో షర్మిల ప్రసంగిస్తూ నేరుగా జగనన్నపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడం వైసీపీ అసమ్మతి నాయకులను ఆకట్టుకుంది. మద్యపాన నిషేదం అమలులో వైఫల్యం కారణంగా జగన్‌నన్న ఓటు అడిగే హక్కు కోల్పోయారని ఆమె విమర్శించారు. రాజధాని లేదు, పోలవరం లేదు, మెట్రో లేదు, ప్రత్యేక హోదా లేదు మరి ఏ అభివృద్ధి చేశారో చెప్పాలని జగన్‌ను ప్రశ్నించిన తీరు అందరినీ ఆలోచింపజేసింది. ప్రత్యేక హోదాను అమలు చేయకుండా మతతత్వ పార్టీగా ఉన్న బీజేపీకి తొత్తుగా జగన్ వ్యవహరించారని ఆమె దుయ్యబట్టారు. ఈ మాటలన్నీ వైసీపీలో చాలా మందిని ఆలోచనలో పడేశాయి. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున వలసలు ఉంటాయన్న సంకేతాలు రాజకీయ పరిశీలకుల నుంచి విన్పిస్తున్నాయి.



● ఎస్.కోట నియోజకవర్గంలో స్వపక్షంలోనే విపక్షం మాదిరిగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుపై ఎమ్మెల్సీ రఘురాజు, ఈయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కడుబండికి సీటు ఇస్తే తాము సహకరించబోమని స్పష్టం చేస్తున్నారు. ఈ వివాదం పార్టీ అధినేత వరకు వెళ్లి పంచాయితీలు జరుగుతున్న తీరు వైసీపీలో ఆందోళన కలిగిస్తోంది. అలాగే విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం వంటి నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు, మద్దతుగా కుటుంబాలు టీడీపీలో చేరుతున్న తీరు కూడా వైసీపీని టెన్షన్ పెడుతోంది. రెండు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి చర్యలు తీసుకోవాలని షర్మిల పిలుపునిచ్చారు. దీంతో వైసీపీ నుంచి వలసలు పెరిగే పరిస్థితి స్పష్టంగా కన్పిస్తోంది.

టీడీపీలోకి 450 కుటుంబాలు

రేగిడి మండలంలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒక గ్రామాన్ని చూసి మరోగ్రామం జగన్ పార్టీకి షాక్‌లు ఇస్తున్నారు. ఇటీవల ఆరు గ్రామాల్లో వైసీపీ నేతలు, శ్రేణులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పగా తాజాగా బుధవారం మరో రెండు గ్రామాల వారు జలక్ ఇచ్చారు. పెద్దశిర్లాం, ఖండ్యాంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో వారంతా పార్టీ మారారు.

- రేగిడి



మాజీ సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

యూటీఎఫ్ నాయకుల నిర్బంధం

● పాఠశాలల నుంచి నేరుగా పోలీసుస్టేషన్‌కు తరలింపు

బొబ్బిలి/ కలెక్టరేట్, జనవరి 24: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు, ఇతర సమస్యలపై చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో యూటీఎఫ్ నాయకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పాఠశాలల్లో విధులు ముగించుకొని వస్తున్న నాయకులను స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, పల్లి సత్యనారాయణ, స్వామి నాయుడులను స్టేషన్‌కు తీసుకొచ్చి పూచీకత్తుపై విడిచిపెట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి ఆందోళన చేపట్టవద్దని ఆంక్షలు విధించారు. కాగా ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలలకు నేరుగా పోలీసులు ఉదయం వెళ్లి వారిని స్టేషన్‌కు రప్పించే ప్రయత్నాలు చేశారు. తరగతులు ముగిసేవరకు తాము వచ్చే ప్రసక్తే లేదని నాయకులు తెగేసి చెప్పడంతో తరగతులు ముగిసిన తరువాత స్టేషన్‌కు రప్పించారు.

బకాయిలు చెల్లించకుంటే రిలే దీక్షలు

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు ఈనెల 31వ తేదీలోగా ప్రభుత్వం చెల్లించకపోతే వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకూ రిలే దీక్షలు చేపడతామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీఆర్‌కే ఈశ్వరరావు అన్నారు. కలెక్టరేట్ వద్ద బుధవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి జ్యోతిరావు పూలే విగ్రహం వరకూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసరావు, ప్రసాదరావు, తిరుపతి నాయుడు, రాజారావు, సత్యనారాయణ, శంకరరావులు ఉన్నారు.



బొబ్బిలి పోలీసుల అదుపులో యూటీఎఫ్ నాయకులు

సమస్యాత్మక గ్రామాల్లో నిఘా

చీటింగు కేసుల్లో దర్యాప్తు వేగవంతం: ఎస్పీ

విజయనగరం క్రైం, జనవరి 24: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచాలని ఎస్పీ దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో బుధవారం మాసాంతర నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమస్యాత్మక పోలింగు కేంద్రాలను, గ్రామాలను సందర్శించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో వున్న నాన్ బెయిల్ వారెంట్‌లను ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో సమస్యలను సృష్టించేందుకు అవకాశం వున్న రౌడీషీటర్లను, వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేసి బాండ్‌లు తీసుకోవాలన్నారు. చీటింగ్ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నిందితులను అరెస్టు చేసి, ఆస్తులను రికవరీ చేయాలన్నారు. ఎన్నికల ప్రచారం కోసం అనుమతులు కోరుతూ వివిధ పార్టీల నాయకులు చేసే దరఖాస్తుల వివరాల కోసం ప్రత్యేక రిజిస్టర్‌ని ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు ఆస్మాఫరహీన్, ఎస్.వెంకటరావు, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, డీఎస్పీలు గోవిందరావు, శ్రీధర్, చక్రవర్తి, న్యాయసలహాదారు పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర పాపారాయునికి నివాళి

బొబ్బిలి యుద్ధం జరిగిన రోజును పురస్కరించుకుని స్మృత్యంజలి

బొబ్బిలి, జనవరి 24: పౌరుషాగ్నికి ప్రతీకగా నిలిచిన బొబ్బిలియుద్ధం (1757 జనవరి 24న)లో అసమాన వీరత్వాన్ని ప్రదర్శించిన తాండ్ర పాపారాయునికి నివాళి అర్పించారు. 266 ఏళ్ల క్రితం ఇదే రోజున యుద్ధం జరిగింది. ఆ మహా సమరాన్ని గుర్తు చేస్తూ స్థానిక రాజవంశీయుడైన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావు శ్వేతాచలపతి కుమార్ కృష్ణరంగారావు (బేబీనాయన) బుధవారం నివాళులు అర్పించారు. స్థానిక బజారు సెంటరులోని తాండ్ర పాపారాయ విగ్రహానికి పూలమాల వేశారు. బొబ్బిలి పులికి జై అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తొలుత భైరిసాగరం చెరువు గట్టుపై ఉన్న యుద్ధ స్మారకస్తంభం వద్దకు చేరుకొని యుద్ధవీరులను స్మరించారు. అనంతరం బొబ్బిలి కోట తూర్పుదేవిడి ముందునున్న ఆఖరి పట్టాభిషిక్తుడైన రాజా రంగారావు విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ బొబ్బిలి యుద్ధం అంటే ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని, పౌరుష. పరాక్రమా లకు మారుపేరుగా నిలిచిందన్నారు. నేడు విజయన గరం-బొబ్బిలి సంస్థానాధీశులం కలిసికట్టుగా స్నేహపూ ర్వకంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విజయచంద్ర, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు రాంబార్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తాండ్ర పాపారాయుని విగ్రహం వద్ద బేబీనాయన, అభిమానులు

వైభవంగా.. అంపకోత్సవం

● వనంగుడికి చేరుకున్న పోలమాంబ ఘటాలు
● 30న మారు జాతర



అంపకోత్సవంలో భక్తజనం

మక్కువ, జనవరి 24 : శంబర జాతరలో చివరి ఘట్టం.. పోలమాంబ అంపకోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత చదురుగుడి నుంచి గ్రామంలోని నడివీధికి అమ్మవారి ఘటాలను తీసుకొచ్చారు. అనంతరం మంగళవాయిద్యాలతో ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించారు. గిరడ, కరణం, నాయుడు కుటుంబాలతో పాటు వడిగళ్ల, తీళ్ల, పూడి కుటుంబీకులు, గ్రామస్థులు , భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలు గోముఖీ నదీతీరం దాటే వరకు సంప్రదాయం ప్రకారం రజకులు చీరలు పరిచారు. వాటిపై చిన్నారులను పడుకోబెట్టి ఆశీర్వాదాలు అందించారు. యాత్రా స్థలం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న వనంగుడికి కాలినడకన అమ్మవారి ఘటాలను తీసుకెళ్లారు. వందలాది మంది భక్తులు వాటి వెంట నడిచారు. వనంగుడి వద్దకు చేరుకున్న ఘటాలతో పూజారి జన్నిపేకాపు భాస్కరరావు ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసిన తర్వాత కట్టు వేశారు. కార్యక్రమంలో తప్పెటగుళ్ల, మహిళల కోలాటాలు, డప్పు వాయిద్యాలు, పోతురాజు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు పోలమాంబను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. కాగా ఈ నెల 30న మారు జాతర నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు.

● శంబర పోలమాంబ జాతర ఆదాయం రూ.21.11 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. శీఘ్రదర్శనం ద్వారా రూ.3,21,600, ప్రత్యేక దర్శనం కింద రూ. 1,39,440, కేశఖండన ద్వారా రూ. 15,840, అన్నదానం కింద రూ.71,107, లడ్డు ప్రసాదం ద్వారా రూ.1,71,375 లభించినట్లు చెప్పారు.



శంబర పోలమాంబ అమ్మవారు

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి: అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె చీపురుపల్లి మండలంలోని విజయరాంపురం పోలింగ్ కేంద్రాన్ని, పట్టణంలో జరుగుతున్న కుల గణన ప్రక్రియను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. వీటిని త్వరితగతిన పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల కోసం వినియోగించే భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, సరైన నామఫలకాలు వంటి ఆరు అంశాలు సంతృప్తికరంగా ఉండాలన్నారు. పట్టణంలోని శివరాం రోడ్డులో జరుగుతున్న కుల గణన తీరును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట కుల గణన జిల్లా ఇన్‌చార్జి కె.సందీప్, చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీవో జి.గిరిబాల, కర్లాం వైద్యాధికారి సువర్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

రాజాం: అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, సరైన నేమ్ బోర్డులు తదితర ఆరు అంశాలు తప్పని సరిగ్గా ఉండాలని చెప్పారు. ఈ మేరకు రాజాం పురపాలక సంఘం పరిధిలోని వస్త్రపురికాలనీ, బొద్దాం గ్రామంల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కలగణన. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో అక్కడ వసతులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాంలో అందుబాటులో ఉంచిన ఓటరు జాబితాను పరిశీలించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ పై ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలోతనిఖీ చేశారు. ఈఆర్వో సుధారాణి, ఆర్డీవో శాంతకుమార్, కులగణన నోడల్ అధికారి కె సందీప్‌కుమార్. తాహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీవో శంకరరావు, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ● **గరివిడి:** గరివిడి మండలంలో కోడూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అచ్యుతరావు, సచివాలయం సిబ్బంది త హసీల్దార్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



రాజాం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

చెక్క కోత మిషన్ తగిలి వ్యక్తి మృతి



సత్యారావు (ఫైల్)

కొత్తవలస, జనవరి 24: చెక్కలు కటింగ్ చేసే మిషన్ ప్రమాదవశాత్తు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమ్మోజు సత్యారావు(58) కార్పెంటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని ఒక ఇంట్లో కార్పెంటరీ వర్కు చేస్తుండగా చెక్కలు కటింగ్‌కు ఉపయోగించే చిన్న మిషన్ పనిచేస్తున్న సమయంలో కట్టుకున్న లుంగీకి చుట్టుకుపోయి తరువాత కాలిపై పడడంతో కాలు తెగి తీవ్ర రక్తస్రావమైంది. దీంతో కేకలు విన్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని రక్షించే ప్రయత్నం చేశారు. కొన ఊపిరితో ఉన్న బాధితుడిని 108కు ఫోన్ చేసి చికిత్సకు తరలించే ప్రయత్నం చేస్తుండగానే తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టెం నిమిత్తం శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించారు.

మహిళ అనుమానాస్పద మృతి

బొబ్బిలి: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన వెంకటరావుతో శ్రీకాకుళం జిల్లా చిన్నకొల్లివలసకు చెందిన పెంకి అరుణ (33)కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి 17 ఏళ్ల కుమారుడు, 16 ఏళ్ల కుమార్తె ఉన్నారు. కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న వెంకటరావు-అరుణ దంపతుల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఇటీవల ఆమె అస్వస్థతకు గురవడంతో అరుణ అన్నయ్య వెళ్లి ఆమెను తీసుకొచ్చి బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఆమె కన్ను మూసింది. అరుణ భర్త తీవ్రంగా కొట్టడంతోనే ఆమె అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చదలవాడ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

బొబ్బిలి: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ జి. భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతబొబ్బిలి గ్రామానికి చెందిన కుప్ప ఉదయ్‌కుమార్ అనే సిమెంట్ వ్యాపారి బైకుపై పట్టణానికి వస్తుండగా బుధవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో వెనుక నుంచి బైకుపై వస్తున్న ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఉమర్ బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక సీహెచ్‌సీలో ప్రథమచికిత్స చేసిన అనంతరం విశాఖ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ ఎస్.ఐ వర్మ తెలిపారు. మృతుని వయస్సు సుమారుగా 25 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు నిలువు అడ్డగీతల షర్టు, ఆర్మీ డిజైన్ కట్‌బనియన్, నల్లని జీన్‌ఫ్యాంట్ ధరించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 96665 55214, 94906 17089 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: మండలంలో సంకిలి గ్రామానికి చెందిన వ్యక్తి నిర్వహిస్తున్న కిరాణా షాపులో 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాస్ బుధవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. సోదాల్లో భాగంగా బెల్ట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసి కోర్టు రిమాండ్‌కు తరిలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ రాజారావు, సిబ్బంది శ్రీనివాసరావు, శివస్వామి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో గిరిజన యువకుడి మృతి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర పంచాయతీ గాదెల్లోవా గ్రామానికి చెందిన బూరి రాజేష్(22) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీనిపై స్థానిక గిరిజన యువత మాట్లాడుతూ గత కొద్దికాలంగా రాజేష్ బోన్‌కాన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందాడని, అయితే అక్కడ మందులకు, వైద్యపరీక్షలకు సొంతడబ్బులు పెట్టలేక ఆరోగ్యం విషమించిందన్నారు. గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకునే రాజేష్‌కు ఆర్థిక స్థోమతు లేకపోవడంతో చనిపోయాడని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాలోని గిరిజనులకు కేజీహెచ్‌లో ఉచిత వైద్యం అందేలా చూడాలన్నారు.

నేడు న్యాయవాదుల మోటార్ సైకిల్ ర్యాలీ

కొత్తవలస: ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం కొత్తవలస న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు తెలిపారు. గురువారం 11 గంటలకు కోర్టు వద్ద బయలుదేరి కొత్తవలస జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తామని తెలిపారు. అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం

రేగిడి: సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ ఆధ్వర్యంలో సంకిలి, అప్పాపురం, దేవదళ, లక్ష్మీపురం పంచాయతీలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, హెచ్ ఆర్ హెడ్ మురళీకృష్ణ తెలిపారు. మజ్జిరామునిపేట, లక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇటీవల నేత్ర వైద్య శిబిరాల ద్వారా 1900 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. బుధవారం నాటి శిబిరంలో 800మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మెడాల్ ఐకేర్ వైద్యులు డా.అనిల్ కుమార్, ఎస్.రామమూర్తి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ ఏర్నేన అప్పలనాయుడు, హెచ్‌ఆర్ సిబ్బంది స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్‌లు పనిచేయక నిలిచిన రిజిస్ట్రేషన్‌లు

కొత్తవలస: రిజిస్ట్రేషన్‌లకు సర్వర్ కష్టాలు తీరడం లేదు. బుధవారం సర్వర్ పనిచేయక పోవడంతో రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాలయానికి వచ్చిన పార్టీలు రిజిస్ట్రేషన్‌లు జరగక సాయంత్రం వరకు ఉండి ఉసూరుమని వెనక్కి వెళ్లారు. బుధవారం ఉదయం నుంచి సర్వర్‌లు పనిచేయక పోవడంతో రిజిస్ట్రేషన్‌లకు ప్రతి రోజూ ఆటంకాలు ఎదురవుతునే ఉన్నాయి. ఒక రోజు ఈకేవైసీ పనిచేయక పోతే మరో రోజు చలానాలు జనరేట్ కాక ప్రక్రియ నిలచి పోతోంది. కార్యాలయంలోనే పరిస్థితులు ఇలా ఉంటే సచివాలయాలకు రిజిస్ట్రేసన్ ప్రక్రియ అప్పగిస్తే పరిస్థితి మరెంత దారుణంగా ఉంటుందోనని పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంలో కనీసం నాలుగు రోజులు పరిస్థితి ఇదే విధంగా ఉంటోందంటున్నారు. గతంలో ఎప్పుడు ఇటువంటి సమస్యలు ఎదురుకాలేదంటున్నారు. బుధవారం సాయంత్రం వరకు క్రవిక్రయదారులు ఏసమయంలోనైనా సర్వర్లు పనిచేయక పోతాయా అని ఎదురు చూసి నిరాశగా వెనుతిరిగారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ'

విజయనగరం రూరల్: విజయనగరంలోని 12, 16 డివిజన్లలో టీడీపీ ఆధ్వర్యంలో గురువారం 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

దుప్పట్ల పంపిణీ

విజయనగరం రింగురోడ్డు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని నేతాజీ మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైల్వే స్టేషన్, ఆర్టీసీ ప్రాంతాల్లో నిరాశ్రయులకు, పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సంద ర్భంగా సంఘ అధ్యక్షుడు పి గుణకరరావు మాట్లా డుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో ఏటా అనేక సంక్షే మ కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. మాజీ సైనికులు ప్రకాష్‌రావు, బొడ్డేపల్లి జగన్నాథ్, బీవీ నారాయణ రావు, మహంతి గణపతి, శివకుమార్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

విజయనగరం రింగురోడ్డు: అందరి సహకారంతో రానున్న రోజుల్లో సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. నగర పాలక సమావేశ మందిరంలో బుధవారం విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 20 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మేయర్ వీవీ లక్ష్మీ మాట్లాడుతూ నగరంలో మిగిలివున్న అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేలా అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనేల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భోజన నిర్వహణపై పర్యవేక్షణ అవసరం

రేగిడి: పాఠశాల మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఉపాధ్యాయుల పర్యవేక్షణ, పరిసరాల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎంఈఓ వరప్రసాదరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మజ్జిరామునిపేట యూపీ పాఠశాలను బుధవారం ఎంఈఓ ఆకస్మికంగా సందర్శించారు. హెచ్‌ఎం భువనేశ్వరికి వివిధ అంశాలపై సూచనలు చేశారు. ఎంఐసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సీఆర్‌ఎంటీ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

తెర్లాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో మండలంలోని వివిధ పాఠశాలల 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో త్రినాథరావు తెలిపారు. ఈ పోటీల్లో 'భారత ప్రజాస్వా మ్యం-ఓటుహక్కు ప్రాధాన్యం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

బూత్ కన్వీనర్ల సమావేశానికి హాజరుకండి

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోటలో గల మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటివద్ద గురువారం జరగనున్న టీడీపీ బూత్ కన్వీనర్ల సమావేశానికి అందరూ హాజరుకావాలని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు కోరారు. వేపాడ, ఎల్.కోట మండలాలకు చెందినవారు ఎల్.కోటకు, జామి, ఎస్.కోట మండలాల వారు ఎస్.కోటకు, కొత్తవలస వారు అక్కడే సమావేశమవ్వాలని తెలిపారు. కన్వీనర్లతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు కోరారు.

ఎస్.కోట బీఎస్పీ ఇన్‌చార్జిగా బోనుకృష్ణ

కొత్తవలస: శృంగవరపుకోట నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జిగా బోను కృష్ణను నియామకం చేస్తూ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు బి.పరంజ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విశాఖపట్టణం బీఎస్పీ అధ్యక్షుడుగా బోనికృష్ణ వ్యవహరిస్తున్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన బోనుకృష్ణ వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో శృంగవరపుకోట నియోజకగర్గం నుంచి బీఎస్పీ తరపున పోటీ చేస్తారని తెలిపారు. అందు చేత పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గంలో బీఎస్పీ విజయం దిశగా చర్యలు తీసుకోవాలని కృష్ణను ఆదేశించారు. తనపై ఎంతో నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియామకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను పర్యటించి బీఎస్పీని బలోపేతం చేస్తానని తెలిపారు.

ఉపాధిలో జాప్యం వద్దు

రేగిడి: గృహ నిర్మాణదారులకు ఉపాధి కింద ఇవ్వవలసిన 90 రోజుల పనిదినాల విషయంలో సిబ్బంది అలసత్వం వహించవద్దని ఏపీఓ ఎస్.హరనాథ్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం ఏపీఓ, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో వారాంతపు సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో హౌసింగ్‌లో ఉపాధి చెల్లింపుల వెనుకబాటుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమీక్షలో ఈసీ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సన్నద్ధం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు పోలీస్ శాఖ అధికా రులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో బాగంగా బుధ వారం జిల్లా పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు పోలీ స్‌లు ముందుగా మాల్ ప్రాక్టీస్ నిర్వహించారు. వంద లాది మంది పోలీస్‌లు ప్రాక్టీస్ కవాతులో పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు గౌరవ వందనం స్వీకరించే మార్గంలో ట్రైలరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ మాట్లాడుతూ జనవరి 26న జరగబోయే వేడుకలకు పోలీస్ శాఖ అంతా సిద్ధం చేసిందన్నారు. శుక్రవారం జరిగే గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారుల సూచనలతో పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చెశామని, రేపటి వేడుకల్లో జిల్లా అధికారులు, నాయకులు పాల్గొంటారన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● రేగిడి మండలంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న 450 కుటుంబాలు

రేగిడి, జనవరి 24: మండలంలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవల ఆరు గ్రామాల్లో వైసీపీ నేతలు, శ్రేణులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పగా తాజాగా బుధవారం మరో రెండు గ్రామాల వైసీపీ నేతలు, శ్రేణులు జలక్ ఇచ్చారు. పెద్దశిర్లాం మాజీ సర్పంచ్ పాలవలస రామచంద్రినాయుడు తమ అనుచరులుగా ఉన్న 250 కుటుంబాలతో కలిసి టీడీపీ తీర్థం స్వీకరించారు. ఇదే పంచాయతీకి చెందిన నలుగురు వార్డుమెంబర్‌లు రెడ్డి సత్యన్నారాయణ, సంచాల కన్నంనాయుడు, మారళ్ల రాములమ్మ, కోట్లు సింహాద్రినాయుడు, మాజీ ఎంపిటిసి సంచాన అప్పలనాయుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ కోట్ల అమ్మాజి ఇంకా పదుల సంఖ్యలో కుటుంబాలు టీడీపీలో చేరాయి. సాయంత్రం ఖండ్యాంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ మద్దతదారుడు గొల్వి హరిప్రసాద్ ఆధ్వర్యంలో 200 కుటుంబీకులు టీడీపీలో చేరాయి. బుధవారం ఈరెండు గ్రామాల్లో కోండ్రుకు దారిపొడువునా ఘనస్వాగతం పలికారు.

● సీఎం జగన్‌రెడ్డి చేస్తున్న విధ్వంసక పాలన, చేస్తున్న వరుస తప్పులతో ఈ ప్రభుత్వం పతనం అంచున ఉందని, వీటిని ప్రజలు, నేతలు గమనించి పార్టీ మారుతున్నారని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈరెండు గ్రామాల్లో నిర్వహించిన వేర్వేరు బహిరంగ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తప్పులు ఎత్తిచూపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గురువాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ మంతిన ఉషారాణి, వి.నాగభూషణరావు, పాలూరి రామినాయుడు, గురవాన ధనంజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఖండ్యాంలో వైసీపీ క్యాడర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

తెర్లాం మండలంలో..



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న బేబీనాయన

తెర్లాం: చీకటిపేట గ్రామంలో వైసీపీని వీడి సుమారు 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధి విధానాలు నచ్చక పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ చీకటి తిరుపతినాయుడు, చీకటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యవత కార్యనిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యుగంధర్, మాజీ ఎంపీపీ సింహాచలం, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జయహో బీసీ విజయవంతం



మాట్లాడుతున్న నాయకులు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ స్థాయిలో ఈనెల 23న నిర్వహించిన 'జయహో బీసీ' సదస్సు విజయవంతమైందని టీడీపీ నాయకులు కంది మురళీ నాయుడు, ముద్దాడ చంద్రశేఖర్, కోండ్రు శ్రీనివాసరావులు చెప్పారు. బుధవారం పార్టీ కార్యాలయంలో టీడీపీలోని బీసీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో బీసీలకు ఈ ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. విధులు, అధికారాలు, కుర్చీలు లేని కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, పదవులు కట్టబెట్టారన్నారు. బీసీలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు వేచలపు శ్రీను, నాయుడు, బోని కుమార్, ఇప్పిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మహిళలకు శిక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట: విద్యా సంకల్పంలో భాగంగా ఫిబ్రవరి 15 నుంచి శృంగవరపుకోట పట్టణంలో బ్యుటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు గొంప కృష్ణ విద్యాసంకల్పం గోడపత్రికను ఆవిష్కరించారు. శిక్షణ పొందాలనుకునే మహిళలు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 10లోపు మొదటి బ్యాచ్‌కు టైలరింగ్‌కు 80 మంది, బ్యుటీషియన్ కోర్సుకు 20 మంది మహిళలను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 93989 79435, 98855 77145 నెంబర్‌లను సంప్రదించవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆఫ్‌లైన్‌లో శృంగవరపుకోట మండలానికి సంబంధించి రాయవరపు చంద్రశేఖర్ 93984 28283. తులసి 83743 26843 నెంబర్‌కు, జామి మండలంలో ఇప్పాక త్రివేణి 94943 33042, లగుడు రవికుమార్ 94405 40102లకు, వేపాడ మండలంలో గుమ్మడి భారతి 93951 61557, గొంప తులసి 91336 77848, లక్కవరపుకోట మండలంలో గనివాడ సతీష్ 82472 18928, కొత్తవలస మండలంలో సత్యనారాయణ 9490106778, రాజేష్ 7989466534 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు. నాయకులు లగుడు రవికుమార్, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడిబాబు, జుత్తాడ రామసత్యం, మాదిబోయిన మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ నేరం

వేపాడ, జనవరి 24: అరిగిపాలెంలో ఎస్సీ, బీసీల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా ఎస్సీలను సాంఘికంగా బహిష్కరించడం దారుణమని తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్, వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్‌లు అన్నారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో గ్రామ దేవత తీర్థం సందర్భంగా కబడ్డీ పోటీల వద్ద ఎస్సీ, బీసీ యువకుల మధ్య చోటు చేసుకున్న చిన్న పాటి ఘర్షణ వల్ల గ్రామ పెద్దలు ఎస్సీలను సాంఘిక బహిష్కరణకు గురి చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. ఎస్సీలతో ఎవరైనా మాట్లాడినా రూ.5వేలు జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేయడం తప్పన్నారు. ఈ సందర్భంగా కిరాణ షాపుల యజమానులను పిలిపించి ఎస్సీలకు సామాన్లు ఇవ్వాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిట్టంపాడును సందర్శించిన డీఎంహెచ్‌వో



చిట్టంపాడులో గిరిజనులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న డీఎంహెచ్‌వో

శృంగవరపుకోట రూరల్: మండ లంలోని బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడు గ్రామా న్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి భా స్కరరావు సందర్శించారు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఆయన కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం పర్యవేక్షించారు. అనంతరం ఇటీవల చనిపోయిన కుటుంబాల వారిని పరామర్శించారు. వారి అనారోగ్యం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకుడు గౌరీష్ మట్లాడుతూ వైద్యులను తమ కొండపైకి పంపించాలని, వైద్యశిబిరాలు పూర్తిస్థాయిలో ఏర్పా టు చేయించాలనీ కోరారు. ఇక్కడి గిరిజనులు వైద్యం కోసం విశాఖకు వెళితే ఉచిత సేవలు అందడంలేవని, దీనివలన గిరిజనులు చాలా ఇబ్బందులు పడు తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తెలియజేయాలని కోరారు. చిట్టంపాడు గ్రామానికి ఆశావర్కర్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. ఈ విషయా లను కలెక్టర్‌కు వివరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించడంలో అలసత్వం వద్దని సి బ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

మానవహారాలు, ర్యాలీల నిర్వహణకు ఏర్పాట్లు

కలెక్టరేట్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నిక సంఘం ఆదేశాల మేరకు గురువారం విజయనగరంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీఆర్వో అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్య మైదానం, గురజాడ కళాభారతిలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్య మైదానం నుంచి పాఠశాల విద్యార్థులతో మానవహారం, నేను ఓటు వేస్తాను అనే ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన, ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన శకటం ఆవిష్కరణ ఉంటాయన్నారు ఉదయం 10.30 గంటలకు నుంచి గురజాడ కళాభారతిలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాలు బహూకరణ, అతిథుల సందేశాలు ఉంటాయన్నారు. జిల్లా న్యాయాధికారి బి.సాయికళ్యాణ చక్రవర్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు తెలిపారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

వేపాడ: బొద్దాం రెవెన్యూ సర్వే నెంబరు 105/2లోగల మెట్ట పోరంబోకు భూమిలో పశువుల ఆస్పత్రికి ఆనుకొని భవన నిర్మాణాలకు చేపట్టే అక్రమ పునాది తవ్వకాలను గ్రామ రెవెన్యూ అధికారి డీవీ రమణ అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నట్టు తెలుస్తోంది. గ్రామానికి చెందిన మహ్మద్ హుసేన్‌బీ అలియాస్ పెంటమ్మకు భర్త సీలార్ ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా పోలీసు కేసులు పెడతామని వీఆర్వో హెచ్చరించారు.

'ఆడుదాం ఆంధ్రా'లో మాకు అన్యాయం

● బొబ్బిలి మండల కబడ్డీ జట్టు ఆరోపణ

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం జరిగిన నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలో తమకు తీరని అన్యాయం జరిగిందని బొబ్బిలి మండల కబడీ జట్టు సభ్యులు ఆరోపించారు. బుధవారం రాత్రి క్రీడామైదానంలో విలేకరులతో వారు మాట్లాడారు. జట్టు కెప్టెన్ బి.సతీష్ మాట్లాడుతూ బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు-తెర్లాం మండలం జట్టుతో ఫైనల్స్ ఆడామని, 15 నిమిషాలు ఆడిన తరువాత ఐదు నిమిషాలు బ్రేక్ ఉంటుందని, మళ్లీ 15 నిమిషాలు ఆడాల్సి ఉందన్నారు. ఆఖరి ఒక్క నిమిషం ఉండగా అంపెర్లు ఏకపక్షంగా వ్యవ హరించడంతో తాము అభ్యంతరం చెప్పామన్నారు. ఈ లోగా ఆట సమయం ముగిసిందని చెప్పి వెంటనే తెర్లాం జట్టును విజేతగా ప్రకటించారన్నారు. వాస్తవానికి ఏ మండలం జట్టు సభ్యులు ఆ మండలానికి చెందిన అంపైర్లను నియమించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అలా పాటించలేదన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవోకు ఇతర అధికారులకు చెబితే సాంకేతికపరంగా అంపైర్లు చెప్పిందే ఫైనల్ అని చెప్పి తప్పించుకున్నారన్నారు. ఇది చాలా అన్యాయమని, ఫైనల్ పోటీలను కచ్చితమైన అంపైర్ల సమక్షంలో మళ్లీ నిర్వహించాలని కెప్టెన్ సతీష్‌తో పాటు మెట్టవలస గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు ఇతర పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. అంపైర్లపై కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాదనకు దిగారు. ఆ సయమంలో పోలీసులెవరూ లేకపోవడం గమనార్హం.



విలేకరుల ముందు ఆరోపిస్తున్న బొబ్బిలి మండల కబడ్డీ జట్టు

మేము పక్షపాతంగా వ్యవహరించలేదు

క్రీడా పోటీలను నిబంధనల ప్రకారం చాలా నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నాం. గెలుపోటములు నిర్ణయం అయినప్పుడు అసంతృప్తి సహజంగా ఉంటుంది. అంపైర్లను సొంతమండలం వారిని నియమించలేదు . బొబ్బిలి-తెర్లాం జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరిగినప్పుడు బాడంగి మండలానికి చెందిన పీడీలు అంపైర్లుగా వ్యవహరించారు. మాకు క్రీడాకారులందరూ సమానమే.

-నల్ల వెంకటనాయుడు, గ్రౌండ్ ఇన్‌చార్జి

ఘనంగా ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు, జనవరి 24: ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో మొదటి సర్వీసు నుంచి ప్రతి డ్రైవర్‌కు జిల్లా ప్రజా రవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్ శ్రీనివాసరావులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ మాట్లాడుతూ బస్ కండిషన్, డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత ఉండాలన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవ లందించాలని సూచించారు. ప్రమాదాలను తగ్గించి ఇంధనం ఆదా చేయా లన్నారు. వాహనాల నిర్వహణపై అవగాహన, ఎప్పటికప్పుడు మరమ్మతుల ద్వారా ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించడం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ సిబ్బంది బుధవారం రహదారి భద్రతా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. హ్యాపీ డ్రైవర్స్ డే సందర్భంగా థాంక్యూ డ్రైవర్ గారూ అంటూ పుష్పగుచ్ఛాలు, మిఠాయిలు పంచిపెట్టారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్ కె.రమేష్ వివరించారు. విజయనగరం రీజియన్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.వేణు పాల్గొన్నారు.



డ్రైవర్లను అభినందిస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7075656208

AJV_164648

ఆంధ్రజ్యోతి

అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకో చంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు: 9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

ఆసరా కాదు.. అక్కా చెల్లెమ్మలకు టోకరా

- వైసీపీ ప్రభుత్వ తీరుపై టీడీపీ నాయకుల విమర్శ

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చేది 'ఆసరా' కాదని.. అక్కా చెల్లెమ్మలకు పెద్ద టోకరా అని టీడీపీ నాయకులు ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ తీరుపై వారు బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ విధానాలను ఎడ్డగట్టారు.

మహిళా సంక్షేమానికి కృషి చేసింది చంద్రబాబే



మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు

రాజాం: రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి కృషి చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడేనని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా వ్యవస్థతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే కాకుండా... అంతర్జాతీయ వేదికపై వారిని నిలబెట్టిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. పసుపు కుంకుమ పేరుతో 2018-19లో రూ.10 వేల కోట్లు చెల్లించారన్నారు. వడ్డీ రాయితీ కింద రూ.2,514 కోట్లు చెల్లించిన ఘనత కూడా చంద్రబాబుకు దక్కిందన్నారు. అయినా టీడీపీ రుణమాఫీ చేయలేదంటూ జగన్‌రెడ్డి దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని కోండ్రు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం రుణ మాఫీని పక్కాగా అమలు చేసిందన్నారు. 45 ఏళ్లకే పింఛను అనే హామీతో అధికారంలోకి వచ్చిన జగన్ తరువాత చేయూత అంటూ దగా చేశారన్నారు. డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2,118 కోట్లు అభయ హస్తం నిధులు దారి మళ్లించడమే మహిళా సంక్షేమమా? అని సీఎం జగన్‌ను కోండ్రు ప్రశ్నించారు.

ఇచ్చేది గోరంత.. దోచుకునేది కొండంత



మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ (వీరఘట్టం): మహిళల మాంగళ్యాలు తెంచిన జగన్‌రెడ్డి ఇచ్చేది గోరింత, దోచుకునేది కొండంత అని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించా రు. వీరఘట్టం మండలంలోని హుస్సేన్ పురం గ్రామంలో ఆయన బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు రూ.20వేలు లబ్ధి పొందారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఒక్కొక్క మహిళ పొందిన లబ్ధి రూ.15వేలు అని చెప్పారు. ఈ రకంగా 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి టోకరా వేశారని జయకృష్ణ విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, పొన్నాడ నాగేశ్వరరావు, జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింత ఉమ, చందక వెంకటరావు, రౌతు వెంకటనాయుడు, జగదీష్, పక్కి శివుడు, రౌతు కృష్ణ ఖండాపు హరిబాబు, శంకరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన అప్పారావు

రాష్ట్ర దాసరి సాధికార సమితి అధ్యక్షుడు తుపాకుల అప్పారావు బుధవారం టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జయకృష్ణ ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర సాధికార సమితి మెంబర్ పడాల రామకృష్ణ, పొట్నూరు రత్నాజీ, కొలిపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మోసం



మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: నోరు తెరిస్తే అక్కా చెల్లెళ్లంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్ మహిళలకు నిట్టనిలువునా మోసం చేస్తున్నారని టీడీపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. బుధవారం ఆమె గుమ్మలక్ష్మీపురంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డ్వాక్రా సంఘాలను కూకటి వేళ్లతో పెకిలిస్తున్న జగన్‌రెడ్డి ఆసరా పేరుతో పొదుపు సంఘాలకు ఉద్ధరించేటట్టు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడం కాక మరేమిటన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు పావని, ఉపాధ్యక్షురాలు లావణ్య, మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి తదితరులు ఉన్నారు.

దారుణంగా మోసం చేశారు..

విజయనగరం రూరల్: అనేక హామీలు ఇచ్చి మహిళలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ స్త్రీలను దారుణంగా మోసం చేశారని విజయనగరం నియోజకవర్గం ఇంచార్జి అదితి గజపతిరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్వాక్రారుణాలు, పసుపు-కుంకుమ ద్వారా చంద్రబాబు పాలనలో మహిళలందరూ సమానంగా రూ.20 వేలు లబ్ధి పొందారు. జగన్ పాలనలో ఒక్కో మహిళకు రూ.15వేలకు తగ్గిపోయిందన్నారు. సున్నా వడ్డీ రూ.5లక్షలని, జగన్ పాలనలో రూ.3 లక్షలకు కుదించేశాడు అన్నారు. జాతీయ స్థాయిలో మహిళలై ఆఘాత్యాలు 66.4 శాతం కాగా, రాష్ట్రంలో 96.2 శాతంగా ఉందన్నారు. గడిచిన నాలుగేళ్లల్లో జగన్ రెడ్డి మహిళలకు టోకరా వేశారని, మహిళా భద్రతలో డొల్లతనాన్ని తెలియజేస్తుందన్నారు.

మాంగళ్యాలు తెంచి..

శృంగవరపుకోట: 'నాసిరకం మద్యంతో మహిళల మాంగళ్యాలు తెంచిన జగన్ రెడ్డీ.. నువ్విచ్చేది ఆసరా కాదు.. టోకరా' అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విమర్శించారు. బుధవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం పాలనలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా కోటి మంది రూ.20 వేల వంతున లబ్ధి పొందారని చెప్పారు. జగన్ రెడ్డి ఈ మొత్తాన్ని రూ.15 వేలకు కుదించారని ఆరోపించారు. సొంత బాబాయ్ హత్య కేసులో నరహంతకులను రక్షిస్తున్న జగన్ రెడ్డి మహిళల ద్రోహి కాదా అని ప్రశ్నించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, సరిపల్లి రామకృష్ణ, పొట్నూరు అప్పలరాజు, పెదగాడి రాజు, చెక్క కిరణ్‌కుమార్, రాయవరపు రవి కుమార్, కునిశెట్టి రాముడు, భోనంగి లక్ష్మి, పోలిమేర మహలక్ష్మి పాల్గొన్నారు.



ఎస్.కోటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

పలుచోట్ల తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు



జమ్మయ్యపేటలో కేంద్రం బయట ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు

భోగాపురం: సమ్మె విరమించినప్పటికీ బుధవారం భోగాపురం మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. కేంద్రాల తాళాలను సచివాలయ ఉద్యోగులు అందజేయకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు ఆరుబయటే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. దీనిపై సీడీపీవో ఎస్తేర్‌రాణిని వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు సచివాలయాల ఉద్యోగుల దగ్గర ఉన్నాయని, పైఅధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ వర్కర్లకు అందజేస్తున్నారని చెప్పారు. అయితే కుల గణన, తదితర విధుల కారణంగా కొంత మంది సచివాలయాల ఉద్యోగులు సమయానుకూలంగా తాళాలు అందజేయలేకపోయారని తెలిపారు. అయితే తర్వాత అన్ని కేంద్రాలు తెరిచినట్టు తెలిసిందన్నారు. అన్ని కేంద్రాలు సమయానుకూలంగా గతంలో వలే పనిచేసేలా చూస్తామని చెప్పారు.

అంగన్‌వాడీలకు సరుకుల అప్పగింత

గజపతినగరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 42 రోజులుగా సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీలు ప్రభుత్వ చర్చలు సఫలం కావడంతో గురువారం కేంద్రాలు తెరిచారు. ఇంతవరకు సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు ప్రభుత్వం నుంచి వచ్చిన పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు పంపిణీ చేయగా, మిగిలిన సరుకులను అంగన్‌వాడీలకు అప్పగించారు. ప్రాజెక్టు పరిధిలో 178 అంగన్‌వాడీ, 34 మినీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామని ప్రాజెక్టు పీవో నాగమణి తెలిపారు.

సభ మధ్యలో వెళ్లిపోయిన డ్వాక్రా సభ్యులు



సభ నుంచి బయటకు వెళ్తున్న మహిళలు

గంట్యాడ: గంట్యాడలోని కొటారు బిల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం ఆసరా నిధులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయితే సభా వేదికపై ప్రజా ప్రతినిధులు మాట్లాడుతుండగా పలువురు మహిళా సంఘాల సభ్యులు బయటకు దారితీశారు. వారిని సభలో ఉంచేందుకు వైకేపీ సిబ్బంది, వీవోలు పడరాని పాట్లు పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సూర్యనారాయణ, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎంపీపీ వీరుబండి హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా గరివిడి మండల సమావేశం

గరివిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. పలువురు సభ్యులు తమ పరిధిలో ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉందని కాపుశంభాం సొసైటీ అధ్యక్షుడు లెంక శ్రీరాములు ఆరోపించారు. ఐకేపీ ద్వారా మంజూరైన శ్రీనిధి నిధులకు సంబంధించిన రికార్డులు సరిగా లేవని తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు యడ్ల అప్పారావు తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీవో భాస్కరరావు హామీఇచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు గుడివాడ వెంకట శ్రీరాములనాయుడు, రఘురామరాజు, ఎంపీడీవో గొర్లె భాస్కరరావు పాల్గొన్నారు. తాటిగూడ సొసైటీ అధ్యక్షుడు యడ్ల అప్పారావు, కాపుశంభాం సొసైటీ అధ్యక్షుడు లెంక శ్రీరాములనాయుడు, పొన్నాడ కుమార్ పలు సమస్యలు ప్రస్తావించారు. ఎంపీపీ ప్రతినిధి మీసాల విశ్వేశ్వరరావు తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఏఎల్ ల్యాబ్‌ను వినియోగించుకోండి



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవోలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్) ల్యాబ్‌ను ఎంఈవోలు యు.సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 500 పాఠశాలలకు మాత్రమే ప్రభుత్వం ఈ ల్యాబ్ సౌకర్యం కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆనందమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి పీఆర్సీ ప్రకటించాలి

పాలకొండ: ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఆర్డీవో లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్సీ డీఏ అరియర్స్ రూ.7,382 కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న వెయ్యి కోట్లకు పైగా పీఎఫ్ లోన్లు, పార్ట్‌ఫైనల్ పేమెంట్లు వెంటనే చెల్లించాలన్నారు. గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.4,500 కోట్లు సరెండర్ లీవుల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో బీటీఏ నాయకులు తండాడి అనీల్‌కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు, మజ్జి సోమేశ్వరరావు, కాయల బాలయేసు, గడ్డెయ్య, గొట్టుపల్లి సతీష్, శేఖర్, పిసిని జయమ్మ ఉన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): జిల్లావాసులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ సూచించారు. బుధ వారం గిరిమిత్ర భవనంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు ఎంతో అవసరమన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు జిల్లావాసులు ముందుకు రావాలని సూచించారు. అర్హత కలిగిన వారికి కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా ఐదు శాతం వడ్డీతో రూ. లక్ష బ్యాంకు ద్వారా రుణం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్, డీపీవో బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీ వర్గాలు ఎప్పటికీ టీడీపీతోనే



మాట్లాడుతున్న పతివాడ, కర్రోతు బంగార్రాజు

పూసపాటిరేగ: రాష్ట్రం, జిల్లాలో బడుగు బలహీన బీసీ వర్గాలు ఎప్పటికీ టీడీపీతోనే ఉంటారని పార్టీ నెల్లిమర్ల నియోజవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు అన్నారు. బుధవారం చల్లవానిపేట గ్రామంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని, జగన్ ప్రభుత్వం వచ్చాక బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసినా, వాటికి నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పతివాడ తమ్మినాయుడు, కర్రోతు నర్సింగరావు, అల్లు విజయ్‌కుమార్, ఎన్ని సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తాం

చీపురుపల్లి: రానున్న తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బీసీలకు అన్ని రకాలుగా న్యాయం చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబు అమలు చేసిన ఆదరణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆసరా పేరుతో జగన్మోహన్‌రెడ్డి ఆడ పడుచులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ, నాయకులు దన్నాన రామచంద్రుడు, మహంతి అప్పలనాయుడు, పైల బలరాం, గవిడి నాగరాజు, మండల అప్పలనాయుడు, పనస మణికంఠ, మీసాల కాశీ, ఆరతి సాహు, మీసాల శ్రీధర్‌నాయుడు, గంట్యాడ సత్యనారాయణ, వెంపడాపు లక్ష్మనాయుడు, బాణాన రాము తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో తీరుపై మహిళల ఆందోళన



బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం ముందు మహిళల ధర్నా

బొబ్బిలి: అధికార పార్టీ నాయకుల అండదండలతో రామభద్రపురం వీఆర్వో అప్పలనాయుడు నిరుపేద మహిళలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపిస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు బుధవారం బాధిత మహిళలు ధర్నా చేపట్టారు. రామభద్రపురం మండల కేంద్రంలోని శ్రీరామనగర్ కాలనీకి చెందిన పల్లె పార్వతి, కేతిరెడ్డి సింహాచలం అనే మహిళలు తమకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా చేశారు. తమ గోడును ఆర్డీవో ఎ.సాయి శ్రీకి వివరించారు. అనంతరం విలేకర్లతో పల్లె పార్వతి మాట్లాడుతూ తన భర్త రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని చెప్పారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఇళ్లల్లో పాచిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపింది. ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు చేయడం లేదన్నారు. అధికార పార్టీ వారికి ఒకే ఇంట్లో ఆరుగురికి ఇళ్లు మంజూరు చేశారన్నారు. రూ.లక్షల్లో వసూలు చేసి వైసీపీ అక్రమాలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేతిరెడ్డి సింహాచలం మాట్లాడుతూ తన భర్త కళాసీగా పని చేస్తున్నాడని, జగనన్న లేఅవుట్‌లో పేదోళ్లకు ఇళ్లు ఇవ్వలేదని వాపోయింది. వీఆర్వో అప్పలనాయుడు వైసీపీ చేతిలో కీలుబొమ్మగా పనిచేస్తూ వారు ఆడించినట్లుగా ఆడుతున్నారన్నారు. దీనిపై ఆర్డీవో సాయిశ్రీ స్పందిస్తూ దర్యాప్తు జరిపించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

'పౌష్టికాహారంలో వైసీపీ నేతలకు వాటాలు'

జామి: అంగన్‌వాడీల సమ్మె సమయంలో పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని వైసీపీ నేతలు తమ ఇళ్లకు తెప్పించుకోవడం సిగ్గుచేటని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అన్నారు. ఆవు చేలో మేస్తే... దూడ గట్టున మేస్తుందా అన్న సామెత వైసీపీ నేతలకు సరిపోతుందని వ్యాఖ్యానించారు. బుధవారం భీమసింగిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో వైసీపీ నాయకులు దౌర్జన్యాలు చేస్తుంటే ఎమ్మెల్యే అప్పలనర్సయ్య కళ్లు మూసుకున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీల సమ్మె సమయంలో పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని వైసీపీ నేతలు తమ ఇళ్లకు తెప్పించుకోవడం సిగ్గు చేటన్నారు. డ్వాక్రా రుణ మాఫీ అని ఈ ప్రభుత్వం ఆడపడుచులను మోసం చేస్తోందని ఆరోపించారు. ఆసరా పేరుతో సంబరాలు చేయడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో స్వామినాయుడు, సూర్యారావు, చైతన్య, జగన్, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ జనరల్ సెక్రటరీగా మురళి

తెర్లాం: తెలుగుదేశం పార్టీ ప్రొఫెషనల్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఆళ్లబోయిన మురళి ఎంపికయ్యారు. ఈ మేరకు మురళి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్టీకల్చర్ వృద్ధి చేసేందుకు మండల పరిధిలో కనీసం 200 ఎకరాల పైబడి సమకూర్చాలని కోరారు. 200 ఇంకుడు గుంతలు నిర్మించేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

కలెక్టరేట్: ఆడపిల్లలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల, బాలల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ హిమ బిందు, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ● **శృంగవరపుకోట రూరల్:** వెంకటరమణపేట గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బుధవారం జాతీయ బాలిక వారోత్సవాలు నిర్వహించారు. ● **బొబ్బిలి:** బాలికా దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ తొమ్మిదో తరగతి విద్యార్థులకు బాల్య వివాహాలు, లింగవివక్ష అనే అంశాలపై వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డిప్యూటీ డీఈవో కె.బ్రహ్మాజీ బహుమతులను పంపిణీ చేశారు. అలజంగి సీబీఎం పాఠశాలలో హెచ్‌ఎం కె.కృష్ణదాసు ఆధ్వర్యంలో చిన్నారులు ఆడపిల్లల భద్రతకు సంబంధించిన నినాదాలు రాసిన పలకలతో ప్రదర్శన నిర్వహించారు. ● **రేగిడి:** బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని దేవుదళ కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి సూచించారు. దేవుదళ కేజీబీవీలో బుధవారం బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. టీచర్లు చిన్నతల్లి, జయశ్రీ, భారతి పాల్గొన్నారు.



శృంగవరపుకోట రూరల్: వెంకటరమణపేటలో..



బొబ్బిలి కేజీబీవీలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీ



రేగిడి: దేవుదళ కేజీబీవీలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్స్‌పాల్, సిబ్బంది

ఘనంగా సాంబమూర్తి తీర్థం



డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

వేపాడ: వల్లంపూడి గ్రామంలో శ్రీసాంబమూర్తి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. గురువారం సైకిల్ పోటీలు, ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సర్వే వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో కుల గణన సర్వేను వేగవంతం చేయాలని సూపర్‌వైజర్ ప్రసాదరావు సూచించారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియ పరిశీలనకు ఎంపీడీవో జి.పైడితల్లి పంచాయతీలవారీగా సిబ్బందిని బుధవారం నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో పొందుపర్చిన అంశాలను విధిగా వివరించి నమోదు చేయాలన్నారు. ఈ నెల 28లోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో సచివాలయ కార్యదర్శి తిరుపతి భాస్కరరావు, రెడ్డి కాంతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు ఓటరు దినోత్సవం



ఓటు రూపంలో కూర్చున్న విద్యార్థులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఎన్నికల ఉప తహసీల్దార్ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో వేంకటేశ్వరావు ముఖ్యఅతిథి గా పాల్గొంటారని చెప్పారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఓట్ అనే అక్షరాల రూపంలో కూర్చోబెట్టారు.

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా దన్నాన



చీపురుపల్లి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కుడు, చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వు లు జారీ చేశారు. రామచంద్రుడుకు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పెన్షనర్ల ధర్నా

గంట్యాడ: సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని మండల పెన్షనర్ల సంఘ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో మండల పెన్షనర్ల సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం దశలు వారీగా పోరాటం చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎంఎస్ఎన్ రాజు, చల్ల కృష్ణంనాయుడు, బూడి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షల్లో దివ్యాంగులకు స్క్రైబ్ అవకాశం

నెల్లిమర్ల: ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల్లో ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు స్క్రైబ్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పదో తరగతి పరీక్షల్లో స్క్రైబ్ వినియోగించుకున్న దివ్యాంగులు.. ఇంటర్ పరీక్షల్లో స్క్రైబ్ కోరితే మంజూరు చేసేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అధికారం ఇస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు తొలిసారిగా స్క్రైబ్‌ను కోరితే ఆ అభ్యర్థి దివ్యాంగ వివరాలను ఆర్‌ఐవో, డీవీఈవో, డీఐఈవోలకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ప్రిన్సిపాల్స్‌కు సూచించారు.





